జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శనివారం | 11-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 725 పేజీలు: 4 వెల : రూ.7

# ఆ తల్లికి.. ఏం కష్టమొచ్చిందో..!

❋ ఇద్దరు కుమార్తెలకు గడ్డి మందు ఇచ్చి.. ఆపై తాను తాగిన తల్లి ❋ ఇంట్లో ఒకరు.. ఆసుపత్రిలో ఇద్దరు మృతి ❋ ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనకు గురై ఆత్మహత్య ❋ మర్రివలసలో విషాదం

జలుమూరు, జులై 10 (వార్త): భర్త చనిపోయాడు.. పెద్ద కుమార్తెకు భర్త వదిలేశాడు.. చిన్న కుమార్తె దివ్యాంగురాలు.. దీనికితోడు కటిక పేదరికం.. తరచూ అనారోగ్య సమస్యలు.. తాను చనిపోతే పిల్లల పరిస్థితి ఏంటన్నది ఆ తల్లి మానసిక సంఘర్షణకు లోనైంది.. ఏం చేయాలో తెలియక ఇద్దరు కుమార్తెలకు గడ్డి మందు ఇచ్చి.. ఆ పై తాను కూడా తాగి మృత్యువును కౌగిలించుకున్న ఘటన జలుమూరు మండలం మర్రివలసలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మర్రివలస గ్రామానికి చెందిన ముద్ద అప్పయ్య, దాలెప్పమ్మ(65) దంపతులకు నలుగురు కుమార్తెలు. అందులో ముగ్గురికి వివాహాలు అయ్యాయి. చిన్న కుమార్తె సరస్వతి(35) దివ్యాంగురాలు. అప్పయ్య ఐదు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద కుమార్తె



దాలమ్మ(45)ను భర్త విడిచిపెట్టడంతో కన్నవారింటిలోనే ఉంటోంది. చిన్న కుమార్తె దివ్యాంగురాలు. తన ఇద్దరి కుమార్తెలతో కలిసి జీవనం దాలెప్పమ్మ సాగిస్తోంది. తరచూ ఆ ముగ్గురూ అనారోగ్యానికి గురవుతూ.. మానసికంగా బాధపడుతున్నారు. పనికి వెళితే తప్ప పూటగడవని పరిస్థితి. ఆదుకునే వారు కరువయ్యారు. తాను మరణిస్తే ఇద్దరు కుమార్తెల పరిస్థితి ఏంటని తరచూ దాలెప్పమ్మ మానసికంగా బాధపడుతుండేది. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు పేదరికం వల్ల జీవనం సాగించడం కష్టమని భావించి కఠిన నిర్ణయాన్ని ఆ తల్లి తీసుకుంది. తల్లీ కుమార్తెలిద్దరూ శుక్రవారం ఉదయం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కొద్దిసేపటి తర్వాత అపస్మారకస్థితికి చేరుకోగా స్థానికులు గమనించారు. 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించగా.. అప్పటికే




దాలెప్పమ్మ మృతి చెందింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలను బుడితిలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో.. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని రిమ్స్‌కు రిఫర్





చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు కుమార్తెలు కూడా ప్రాణాలు విడిచారు. దీంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఎస్ఐ బి.అశోక్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్వో దూసి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.





# ఎవడైతే నాకేంటి? నాకు అడ్డువస్తే.. తగ్గేదిలే..!

❋ పలాసలో జర్నలిస్ట్ తిరుమల, జనసేన నాయకుడు ప్రదీప్‌పై టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు దాడి
❋ పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టు సంఘాలు ❋ టీడీపీ నాయకుల తీరుపై జనసేన శ్రేణుల ఆగ్రహం

పలాస, జూలై 10 (వార్త): టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. సమాజహితం కోసం పనిచేసే జర్నలిస్టులపై దాడికి దిగుతున్నారు. ఇదేం పని అడిగితే ఎవడైతే నాకేంటి? డోంట్‌కేర్.. నాకు అడ్డు వస్తే తగ్గేదిలే అంటూ సినిమా డైలాగులు చెబుతున్నాడు.. బడ్డ నాగరాజు. వివరాల్లోకి వెళితే.. గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో పలాస సమీపంలోని గరుడుఖండి వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వెనుక చెరువు ప్రాంతంలో రాత్రి వేళ అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో జర్నలిస్టు తిరుమలరావుతో పాటు జనసేన నాయకుడు ప్రదీప్ వెళ్లారు. రోడ్డుపై నిలబడి తవ్వకాల దృశ్యాలను వీడియోలో చిత్రీకరిస్తుండగా అక్కడి నుంచి ఒక లారీ బయలుదేరింది. అనంతరం పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి ఈ విషయాన్ని టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుకు సమాచారం చేరవేశాడు. దీంతో నాగరాజుతో పాటు బూర్లె యోగేశ్వర్, మరికొందరు అక్కడికి చేరుకుని జర్నలిస్టు తిరుమలరావుతో పాటు ప్రదీప్‌పై దాడికి పాల్పడ్డారు. మా ప్రభుత్వమని, అంతా మా ఇష్టమని నువ్వేం చేసుకుంటావో చేసుకో అంటూ బరితెగింపు మాటలు అడాడు. ఈ విషయాన్ని జర్నలిస్టు తన తోటి




సహచరులకు, జర్నలిస్టు సంఘాలకు తెలియజేశారు. ఈ ఘటనపై పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ, నిందితులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణకు అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, బాధితుడు కూడా పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుపై పలు విమర్శలు ఉన్నాయి. అధికార మదంతో రౌడీయిజం చేస్తున్నాడని, దందాలు సాగిస్తున్నాడని, సెటిల్‌మెంట్ల పేరుతో దాదాగిరి చేస్తున్నాడని పలాస-కాశీబుగ్గ ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. గరుడఖండి వద్ద వేసిన లేఅవుట్ కోసం కొండలు, ప్రభుత్వ భూములు తవ్వి మట్టిని రవాణా చేస్తున్నాడని, ఎవరైనా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

## జనసేన కార్యకర్తపై దాడికి ఖండన

జనసైనికునిపై టీడీపీ నేత దాడి చేయడాన్ని ఆ పార్టీ శ్రేణులు ఖండిస్తున్నారు. పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై జనసేన నాయకులు, ముఖ్య కార్యకర్తలు అత్యవసర సమావేశం నిర్వహించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ధర్మాన్ని గౌరవిస్తూ సంయమనం పాటిస్తున్న జనసైనికుల సహనాన్ని చేతకానితనంగా భావించడం తగదన్నారు. 'ఆనాడు పరామర్శించిన చేతులపైనే... ఈరోజు దాడులా?' అంటూ మండిపడ్డారు. అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అంటూ నిలదీశారు. ఓట్లు వేయించుకునే సమయంలో జనసైనికులు గుర్తుకొస్తారని, అవినీతిని ప్రశ్నించినప్పుడు మాత్రం శత్రువులుగా చూస్తారా అని ప్రశ్నించారు. కూటమిలో భాగస్వామ్య పార్టీ నాయకుడిపై దాడి జరిగినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. పలాసలో జరుగుతున్న అక్రమ మట్టి, కంకర తవ్వకాలు, లిక్కర్ సిండికేట్ కార్యకలాపాలు, స్థానిక శాంతిభద్రతల పరిస్థితిపై పూర్తి ఆధారాలతో జనసేన కేంద్ర కార్యాలయంతో పాటు రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధికి చెందిన జనసేన నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివిధ మండలాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, జనసైనికులు పాల్గొన్నారు.






## శారదాపురంలో కోతుల బెడద

❋ 12 మందిపై దాడి

సోంపేట, జులై 10 (వార్త): సోంపేట మండలం శారదాపురం గ్రామంలో శుక్రవారం కోతులు దాడులతో గ్రామస్తులు బెంబేలెత్తారు. ఉదయం గ్రామానికి చెందిన కోనారి నారాయణతో పాటు దాసరి నారాయణమ్మ, సార వల్లమ్మ, కృష్ణవేణి, బాలమ్మ లతోపాటు మరో 7 గురుపై కోతులు దాడులు చేసి తీవ్రంగా గాయపరిచాయి. క్షతగాత్రులను వెంటనే సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఇటీవల గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని ఇళ్లల్లోకి చొరబడి సామాన్లను చిందరవందర చేయడమే కాకుండా మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో కోతులు బెడద లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## బాలకపేటలో ఈగలు దండయాత్ర

టెక్కలి, జులై 10 (వార్త): బాలకపేట గ్రామంపై ఈగలు దండయాత్ర చేస్తున్నాయి. ఇళ్ల చుట్టూ బ్లీచింగ్ జల్లి, రసాయనాలు స్ప్రే చేసిన వాటి బెడద మాత్రం పోవడం లేదు. గ్రామస్థులకు ఈగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామంలో ఎక్కడ చూసినా ఈగలే కనిపిస్తుండడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి ఈగల బెడద నుంచి తప్పించేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కాశీబుగ్గలో ఫుట్‌పాత్‌పై మృతదేహం



**పలాస, జులై 10(వార్త):** కుటుంబ కలహాలతో కంచిలి మండలం బైరిపురానికి చెందిన సోమేశ్(40)కాశీబుగ్గ మూడో జంక్షన్ ఫుట్ పాత్ పై మృతదేహాన్ని కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మరణానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించిరు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసుల విచారణలో మృతుడు కంచిలి మండలం బైరిపురం గ్రామానికి చెందిన సోమేశ్ గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, సోమేశ్ మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## కాశీబుగ్గలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**పలాస, జులై 10(వార్త):** పలాస-కాశీబుగ్గ ప్రాంతంలోని అన్న క్యాంటీన్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు రోడ్డుపక్కన వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఆయన మృతికి గల కారణాలు కూడా తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని గుర్తింపు కోసం అవసరమైన చర్యలు చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడికానున్నాయని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

## లైన్‌మన్ కుటుంబానికి బీసీ సంఘం అధ్యక్షుడు పరామర్శ



**కవిటి, జులై 10(వార్త):** కవిటి పంచాయతీ గొండ్యాల పుట్టుగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన విద్యుత్ శాఖ లైన్‌మన్ దుద్ది కూర్మారావు కుటుంబాన్ని ఎం జే పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు శుక్రవారం పరామర్శించారు. తక్కువ వయసులోనే అందరినీ విడిచిపోవడం బాధాకరమని అన్నారు. శాఖా పరంగా అందాల్సిన ప్రయోజనాల విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## పెండింగ్ పరిహారం ఇప్పించండి

**- మూలపేట పోర్టు బాధిత రైతు ఆవేదన**



**సంతబొమ్మాళి, జులై 10 (వార్త):** మూలపేట పోర్టు నిర్మాణంతో భూములు కోల్పోయిన పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని పెండింగ్ పరిహారం ఇప్పించండి మహాప్రభు అంటూ బాధిత రైతు జీరు ధర్మారావు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడారు. తనకున్న ఎకరా 73 సెంట్లు భూమి పోర్ట్ నిర్మాణానికి ఇవ్వగా అందులో 80 సెంట్లు మాత్రమే 21లక్ష 50 వేల రూపాయలు పరిహారం ఇచ్చారని అన్నారు. మిగిలిన పరిహారం ఇవ్వకుండా ఏళ్లు తరబడి అధికారుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాసిల్దార్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణానికి నాతోపాటు మరో 31 మంది రైతులు భూములు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టుకు భూములు ఇచ్చామని తెలిపారు. దీంతో ఎకరాకి అదనంగా ఇచ్చిన 12 లక్షల 50 వేల రూపాయలు కూడా నాకు ఇవ్వలేదని అన్నారు. కొబ్బరి ,జీడి చెట్లు పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పరిహారం కోసం అడిగితే పోలీస్ కేసులంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. మరోపక్క కే .లింగుడు గ్రామంలో సర్వేనెంబర్ 164/12,139/6లో మూడు ఎకరాల 51 సెంట్లకు పాస్ పుస్తకాలు కూడా రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## ఉచితంగా గణిత బోధిని పుస్తకాల పంపిణీ

**ఎల్ఎన్ పేట, జులై 10 (వార్త):** లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు .. విద్యార్థులకు ఉచితంగా గణిత బోధిని పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి,ఉపాధ్యాయులు లయన్.డా.ఎం.కె.మిశ్రో, ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆహ్లాదం..అందని ద్రాక్ష!

**- పార్కుకు నోచుకోని సోంపేట**

**- దశాబ్దాలుగా నెరవేరని కల**

**- సోంపేట పై పాలకుల నిర్లక్ష్యం**

**-నేతలు, అధికారుల తీరుపై విమర్శల వెల్లువ**



**సోంపేట, జులై 10(వార్త):** సోంపేట పరిస్థితి పేరు గొప్ప... ఊరు దెబ్బ అన్న సామెతల తయారయింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న మేజర్ పంచాయతీలో అభివృద్ధి అంతంత మాత్రమే అన్నది జగమెరిగిన సత్యం. పాలకుల నిర్లక్ష్యం... అధికారుల పట్టింపు లేని తనం... వెరసి సోంపేటలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. వివిధ రకాల పన్నుల రూపంలో పెద్ద మొత్తంలోనే ఆదాయం వస్తున్నప్పటికీ అవసరమైన అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీ వెచ్చించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రజలందరికీ అవసరమైన,ఆహ్లాదకరమైన ఓ పార్కును నిర్మాణం చేయాలన్న తలంపు కూడా ఇక్కడ ప్రజాప్రతినిధులకు,అధికారులకు లేకపోవడం తమ దురదృష్టమంటూ సోంపేట ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

### కూర్చోవడానికి చోటు లేని సోంపేట:

సుమారు 25వేల జనాభా... 175 వీధులు... 18 వార్డులతో కూడిన సోంపేట మేజర్ పంచాయతీ లో సాయంత్రం వేళబహిరంగ ప్రదేశాల్లో కనీసం కూర్చోవడానికి చోటు లేదంటే ఆశ్చర్య పోవలసిన విషయం. దాదాపుగా ప్రతి మండల కేంద్రంలోనూ సాయంత్రం వేళ వృద్ధులు, విద్యార్థులు,చిన్న పిల్లలు కాసేపు సేద తీరేందుకు అలాగే ఆహ్లాదం కోసం ఓ అందమైన పార్కును నిర్వహించుకుంటున్న విషయం తెలిసిందే. అటువంటిది సోంపేటలో దశాబ్దాల తరబడి పార్కు కూడా ఏర్పాటు చేయకుండా పాలకుల నిర్లక్ష్యం చేయడం పట్ల ప్రజలు పెదవిరుస్తున్నారు. అటు వైసీపీ ప్రభుత్వంలోనూ ఇటు టిడిపి ప్రభుత్వంలోనూ పార్కు విషయంలో పెద్దలు సరిగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రవ్యక్తం అవుతున్నాయి. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి పంచాయతీ నేతలు కొన్ని లక్షల రూపాయల వ్యయంతో పట్టణ శివారున వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా లేఔట్ లో కేటాయించిన సుమారు ఎకరా విస్తీర్ణంలో పార్కు నిర్మాణానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి బోరుబావి తవ్వించి అక్కడితో వదిలేశారు. అంతకుముందు బాలికోన్నత పాఠశాల ఎదురుగానున్న చిన్నపాటి పార్కును కూడా అభివృద్ధి పేరుతో పూర్తిగా తొలగించేశారు. అంతకుముందు దశాబ్దాల క్రితం ప్రస్తుత ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గల పంచాయతీ పార్కును ఆర్టీసీకి విక్రయించి అక్కడ కూడా పార్కు లేకుండా చేసేశారు. ఇలా ప్రజలకు అవసరమైన పార్కుపట్ల ఉన్న వాటిని తొలగించడమే తప్ప దాని పునరుద్ధరించాలన్న ఆలోచన, ఆకాంక్ష ఏ ఒక్కరికి లేకపోవడం తమ దురదృష్టమని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

### చెరువు గట్టుపై సేద తీరుతున్న వృద్ధులు

సోంపేటలో సాయంత్రం వేళ ముఖ్యంగా వృద్ధులు ఆహ్లాదం మాట అలా ఉంచితే ఇంటి నుంచి కాసేపు బయటకు వచ్చి ఏదో ఒకచోట సేద తీరుతామంటే ప్రశాంతమైన ప్రదేశం లేక దుర్గా గుడి ఆవరణలో చెరువుగట్టు ప్రక్కన దేవాలయం వారు ఏర్పాటు చేసిన కుర్చీలపై కూర్చుని విశ్రాంతి పొందుతున్నారంటే అతిశయోక్తి కాదు. చాలామంది సోంపేటలో అవకాశం లేక కంచిలి మండలం బూరగం రోడ్డుకు వెళ్లాల్సి వస్తోంది. అనేకమంది రామసాగరం గట్టుపైకి వెళ్లి సదుపాయాలు లేని గట్టుపైన కాలక్షేపం చేస్తున్నారు. మరి కొంతమంది బంజరు నారాయణపురం రోడ్డుకు వెళ్లి అటువైపు తోటల్లో కొంత ఆహ్లాదం పొందుతున్నారు. ఇంతకుమించి సోంపేటలో అందమైన ఆహ్లాదం పంచే పార్కు నిర్మాణం చేపట్టడం పట్ల ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజల ముక్తకంఠంతో కోరుతున్నారు.





## శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలి

**- ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు**

**- ఘనంగా ప్రారంభమైన పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు**




**పలాస, జులై 10(వార్త):** శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎసు)రాష్ట్ర విద్యా,వైజ్ఞానిక శిక్షణా తరగతులు శుక్రవారం కాశీబుగ్గ టీకేఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల ప్రారంభానికి ముందుగా పిడిఎస్ యు బిగిపిడికిలి జెండాని రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం తరగతుల ప్రారంభోపన్యాసం ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రాంతానికి ఒక ప్రత్యేక ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యారంగంలో మార్పులు పట్ల ఒక శాస్త్రీయ అవగాహన ఉన్నటువంటి ప్రాంతమని అన్నారు. ఒక నూతన సమాజాన్ని, దోపిడీ, పీడన లేనటువంటి సమ సమాజాన్ని కోరుకునేపీ డీఎస్ యూ ఈరోజు ఈ శిక్షణ తరగతులు నిర్వహించుకోవడం చాలా శుభ పరిణామని అన్నారు. శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, యం .వినోద్ కుమార్ లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ఎన్నికలలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో కేంద్రీకరణ, కాషాయీకరణ చేస్తుందని, నిరుద్యోగ సమస్య పెంచి ప్రభుత్వ రంగ సంస్థలను, కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని దుయ్య బట్టిశీదన్నారు. పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన రేషనాలైజేషన్ ప్రక్రియలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్, యం. సునీల్, అంకన్న సహాయ కార్యదర్శి రాజేష్, నాని, వీరేంద్ర ప్రసాద్, లోకేష్ రాష్ట్ర కోశాధికారి మహేంద్ర తోపు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సొర్ర రామారావు, సోమేశ్వరరావు, కృష్ణవేణి, పిహోడబ్ల్యు జిల్లా అధ్యక్షుకార్యదర్శిలు బి ఈశ్వరమ్మ, పి కుసుమ, ఐఎఫ్ టియు జిల్లా ఉపాధ్యక్షులు జుట్టు వీరాస్వామి, గోరకల బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల నుండి 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**- 34 వినతుల స్వీకరణ**

**పలాస, జులై 10(వార్త):** పేద సమస్యలు పరిష్కరించిందికే ప్రజా దర్బార్ ను చేపడుతున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక-ప్రజాదర్బార్ కార్యక్రమానికి నియోజక వర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సౌకర్యం, గ్రామీణ రహదారులు, విద్యుత్ సమస్యలు, జంగిల్ క్లియరెన్స్ రోడ్లు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 34 వినతిపత్రాలు ఎమ్మెల్యేకు సమర్పించారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని ఎమ్మెల్యే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అర్హమైన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని పేర్కొన్నారు. ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన వినతులను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి

**- విద్యార్థినులకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు, శక్తి యాప్ బృందం**

**- ఏపీ మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహణ**

**జలుమూరు, జులై 10(వార్త):** ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్ వినియోగించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని ఉపాధ్యాయుడు పాగోటి వాసుదేవరావు, శక్తి యాప్ బృందం సభ్యులు ఎం. గిరిధర్, కానిస్టేబుల్ భీమారావు, విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం జలుమూరు మండలం కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల కోసం శక్తి యాప్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. శక్తి యాప్ ద్వారా ప్రమాద పరిస్థితుల్లో పోలీసులకు వెంటనే సమాచారం చేరుతుందని, దీంతో తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ యాప్‌ను వినియోగించడం ద్వారా ప్రతి మహిళకు ఒక పోలీసు రక్షణగా ఉన్నట్లేనని పేర్కొన్నారు. విద్యార్థినులు తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా దీని గురించి అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల భద్రతకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, శక్తి యాప్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ సైక్లింగ్ పోటీలకు జీవన్ కార్తీక్ సిద్ధం

**- విద్యార్థికి సైకిల్, క్రీడా సామగ్రి అందజేసిన ప్రైవేట్ కళాశాల యాజమాన్యం**

**- విజయంతో తిరిగి రావాలని ఆకాంక్ష**

**నరసన్నపేట, జులై 10(వార్త):** జలుమూరు మండలం పాగోడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి కె. జీవన్ కార్తీక్ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్ధమవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మామిడి అప్పన్న తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 26 నుంచి 30 వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ సైక్లింగ్ పోటీల్లో కార్తీక్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం నరసన్నపేట పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థికి అవసరమైన క్రీడా సామగ్రిని అందజేసింది. పోటీలకు ఉపయోగపడే సైకిల్‌తో పాటు ట్రాక్‌సూట్, స్పోర్ట్స్ షూస్, హెల్మెట్‌ను బహూకరించి అతడిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా తిరిగి రావాలని జీవన్ కార్తీక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మామిడి అప్పన్న మాట్లాడుతూ, విద్యార్థి పోటీల కోసం ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడని, అందరి సహకారంతో జాతీయ స్థాయిలో మంచి ఫలితం సాధిస్తాడనే నమ్మకం ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అవసరమైన సామగ్రిని అందించిన కళాశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పరిశ్రమలు అభివృద్ధితోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- పలాసలో జీడి రంగానిక
కొత్త పుంతలు
- ఉత్పత్తి మూడింతల పెంపు
- విలువ ఆధారిత పరిశ్రమల
ఏర్పాటే లక్ష్యం
- ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, జులై 10(వార్త):** వ్యవసాయ- పరిశ్రమలు సమాంతరంగా అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాస నియోజకవర్గంలో జీడి ఉత్పత్తిని గణనీయంగా పెంచడంతో పాటు విలువ ఆధారిత పరిశ్రమలు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించే దిశగా శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సార్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షత వహించారు. సమావేశంలో టెక్కలి ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, పలాస కాజు మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు, జీడి పరిశ్రమల యజమానులు, రైతు ప్రతినిధులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీదారులు, ఎస్సార్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని జీడి సాగు విస్తరణ, అధిక దిగుబడులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిశ్రమల అభివృద్ధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జీడి ఉత్పత్తిలో విజయవంతమైన మహారాష్ట్రలోని రత్నగిరి, కేరళ రాష్ట్రాల్లో అమలవుతున్న సాగు విధానాలు, పరిశ్రమల నమూనాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం ఒక రైతు, ఒక పరిశ్రమ యజమాని, ఒక పారిశ్రామికవేత్తతో కూడిన బృందాన్ని ఆయా ప్రాంతాలకు పంపించి అక్కడి విధానాలను పరిశీలించి పలాసలో అమలు చేసే అవకాశాలను అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధే స్థానిక యువతకు ఉపాధి అవకాశాల విస్తరణకు మార్గమని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, వ్యవసాయం-- పరిశ్రమలు సమాంతరంగా అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. జీడితో పాటు జీడి తొక్క ద్వారా బై-ప్రొడక్ట్స్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎస్సార్ కంపెనీ ముందుకు రావడం శుభపరిణామమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రణాళిక అమలైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పలాస జీడి పరిశ్రమకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి, ఎస్సార్ కంపెనీ ప్రతినిధులు సాయిక్ అప్పారావు, హృషికేశ్ పరంజిత్, అరుణ్ రంజన్, ఏఎంసీ చైర్మన్, పలాస కాజు పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 100 శాతం ఉండాలి

-తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని
ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచన
- సత్యవరం ప్రాథమిక పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

**నరసన్నపేట, జులై 10(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు నూటికి నూరు శాతం ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు సూచించారు. శుక్రవారం నరసన్నపేట మండలం సత్యవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థుల క్రమబద్ధమైన హాజరుతోనే నాణ్యమైన విద్య అందించవచ్చని అన్నారు. తల్లిదండ్రుల్లో విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించి పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించేలా చర్యలు తీసుకుంటే వంద శాతం హాజరు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు నిరంతరం దృష్టి సారించాలని, గైర్హాజరయ్యే విద్యార్థుల వివరాలను తెలుసుకుని వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) అప్పలనాయుడు పాల్గొన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఎంఈఓ ఆదేశించారు.

జలుమూరు పశువైద్యశాలకు

## వైద్యాధికారిని నియమించాలి

- రైతుల విజ్ఞప్తి
- పోస్టు ఖాళీతో పశువైద్య సేవలకు అంతరాయం
- వేలాది పశువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన




**జలుమూరు, జులై 10(వార్త):** జలుమూరు పశువైద్యశాలలో పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో పశువైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శాశ్వత పశు వైద్యాధికారిని నియమించి రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జలుమూరు పశువైద్యశాల పరిధిలో జలుమూరు, వెంకటాపురం, హుస్సేన్‌పురం, చల్లవానిపేట, లింగాలవలస తదితర గ్రామాలకు చెందిన వేలాది పశువులకు వైద్య సేవలు అందాల్సి ఉంది. అయితే వైద్యాధికారి లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు గ్రామీణ పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉన్న మేరకు సేవలు అందిస్తున్నప్పటికీ, మండల కేంద్రంలో శాశ్వత వైద్యాధికారి లేకపోవడం వల్ల పూర్తి స్థాయి వైద్య సేవలు అందడం లేదని రైతులు పేర్కొన్నారు. దీనివల్ల పాల ఉత్పత్తి, పశుసంవర్ధక కార్యకలాపాలపై కూడా ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అనుబంధంగా పశుసంవర్ధకం రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో జలుమూరు పశువైద్యశాలలో వెంటనే పశువైద్యాధికారిని నియమించాలని, అవసరమైన సిబ్బంది, మందులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. దీంతో మండలంలోని వేలాది పశువులకు సకాలంలో వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.



వాడబలిజ, మత్స్యకారులకు

## సముచిత స్థానం కల్పించాలి

- జిల్లా తెలుగుదేశం పార్టీ మత్స్యకార ,
వాడబలిజ నాయకుల డిమాండ్

**పలాస, జులై 10 (వార్త):** వాడబలిజ మత్స్యకారులకు ప్రత్యేక సముకిత స్థానం కల్పించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ మత్స్యకార వాడబలిజ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలాస ఓ ప్రైవేట్ హోటల్లో శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం వాడబలిజ మత్స్యకార జిల్లా ప్రజా ప్రతినిధులందరూ కలిసి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానాంశాలుగా రాష్ట్రంలో వాడబలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మత్స్యకార మండలాల్లో రాజకీయ ప్రాతినిధ్యం ( ఎంపీపీడ జడ్పీటీసీ) మెజారిటీ స్థానాలు కల్పించాలని, శ్రీకాకుళం జిల్లాలో ఫిషింగ్ ల్యాండ్ సెంటర్లు, ఫిషింగ్ జెట్టీ,లు ( బుడగట్లపాలెం) (మంచినీళ్లపేట) గ్రామాల్లో పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంశాలపై చర్చించి వీటిపై జిల్లాలో ఉన్నటువంటి శాసనసభ్యులు, కేంద్ర, రాష్ట్ర మంత్రిలు ప్రత్యేక దృష్టి సారించి మా వాడబలిజ మత్స్యకారులకు ప్రత్యేక సముకిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ మత్స్యకార వాడబలిజ నాయకులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత,
పోషకాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీలకు హెల్త్
సూపర్‌వైజర్ వెంకటరమణ సూచనలు

**నరసన్నపేట, జులై 10(వార్త):** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం నరసన్నపేట మండలం కొల్లవానిపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత సూచనలు అందించారు. అలాగే ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సభ్యులతో మాట్లాడి సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనాన్ని వేడివేడిగా, పరిశుభ్రంగా విద్యార్థులకు అందించాలని, తాగునీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థుల్లో జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## విజయలక్ష్మినగర్‌లో జంగిల్ క్లియరెన్స్

-రోడ్లపై పెరిగిన పొదల తొలగింపుతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు
- పాముల బెడదతో ఇబ్బందులు -నివాసితుల ఆవేదన

**నరసన్నపేట, జులై 10(వార్త):** గొట్టిపల్లి ఫ్లైఓవర్ వంతెనకు ఆనుకుని ఉన్న విజయలక్ష్మి నగర్‌లో



రహదారుల వెంట విస్తారంగా పెరిగిన పొదలు, ముళ్లచెట్లను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. జంగిల్ క్లియరెన్స్ చేపటడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారుల ఇరువైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర పొదలు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు పాములు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో రహదారిపై ప్రయాణించేందుకు భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సిబ్బందితో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టించారు. రహదారిపైకి విస్తరించిన పొదలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా స్థానికులు స్పందిస్తూ, సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకున్న పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ప్రాంతాల్లో తరచూ పర్యవేక్షణ నిర్వహించి పొదలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



డంపింగ్ యార్డులా..

## వంశధార నదీ తీరం

-మారుస్తున్న దుండగులు
- పల్లిపేటలో విచ్చలవిడిగా
వ్యర్థాల పారబోత
- చర్యలు తీసుకోవాలని
అధికారులకు గ్రామస్థుల విజ్ఞప్తి

**పోలాకి, జులై 10(వార్త):** పల్లిపేట గ్రామంలోని సచివాలయం వెనుక ఉన్న వంశధార నదీ ప్రాంతం అక్రమంగా వ్యర్థాలు పారబోసే డంపింగ్ యార్డుగా మారిందని స్థానిక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతంతో పాటు సమీపంలోని శ్మశానవాటిక వద్ద కూడా పెద్ద ఎత్తున చెత్త, వ్యర్థాలను పడేస్తుండటంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని వాపోతున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, స్థానికులు లేని సమయాల్లో పలు ప్రాంతాల నుంచి వాహనాల్లో వ్యర్థాలను తీసుకొచ్చి నదీ తీరంలో, శ్మశానవాటిక సమీపంలో విచ్చలవిడిగా పారబోస్తున్నారని తెలిపారు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు పరిసర ప్రాంతాల్లో అస్వచ్ఛత నెలకొంటోందని చెప్పారు.

వంశధార నదీ పరిసరాలను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అక్రమంగా వ్యర్థాల పారబోత కొనసాగుతున్నా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే పర్యావరణంతో పాటు ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా వ్యర్థాలు పారబోస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, నదీ ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



## మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



- రాజీ ద్వారా కేసుల
పరిష్కారానికి
కక్షిదారులు ముందుకు రావాలి
- నరసన్నపేట సివిల్ జడ్జి ఎస్. వాణి పిలుపు

**నరసన్నపేట, జులై 10(వార్త):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని రాజీ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని నరసన్నపేట సివిల్ జడ్జి ఎస్. వాణి సూచించారు. శుక్రవారం నరసన్నపేట న్యాయస్థాన ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ శాఖలు, బ్యాంకులకు సంబంధించిన కేసుల్లో రాజీ అవకాశాలను పరిశీలించి కక్షిదారులను ప్రోత్సహించాలని కోరారు. మెగా లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న పలు సివిల్, క్రిమినల్ స్వభావం గల రాజీ యోగ్యమైన కేసులతో పాటు బ్యాంకు రుణాలు, మోటారు ప్రమాద పరిహారం, కుటుంబ వివాదాలు, ఇతర రాజీ పరిష్కారానికి వీలున్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.ఐశనివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జ్ఞానభారతి స్కూల్‌కి మరో రెండు కొత్త బస్సులు



**ఇచ్ఛాపురం, జులై 10(వార్త):** జ్ఞాన భారతి పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా ఉంటామని జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రెటరీ సీఈవో జోహార్ ఖాన్ అన్నారు. పాఠశాలలో మరో రెండు నూతన విద్యార్థుల బస్సులను ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి ఫండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం అవసరం

- లుకలాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం
- లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని సూచన



**నరసన్నపేట, జులై 10(వార్త):** విద్యార్థులు విద్యా జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని, వారి విజయానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని లుకలాము ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బాబురావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు చేరుకోవాల్సిన గమ్యాలు, విద్యా ప్రణాళికలు, పరీక్షల సన్నాహక విధానంపై తల్లిదండ్రులకు వివరించారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పించి నిత్యం చదువును పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, అభ్యాసం, సమయపాలన వంటి అంశాల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులకు వివరించి, లోపాలు ఉన్న చోట మరింత శ్రద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. పాఠశాల, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తారని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మడపాం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్

- ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం
- నాలుగు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచన

**నరసన్నపేట, జులై 10(వార్త):** నరసన్నపేట మండలం మడపాం పోలింగ్ బూత్ కేంద్రాన్ని తహశీల్దార్ టి. సత్యనారాయణ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శరత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించి బూత్ లెవెల్ అధికారులతో (బీఎల్‌వోలు) మాట్లాడారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న అధికారులు, ప్రక్రియ పూర్తికి ఇంకా నాలుగు రోజులు మాత్రమే గడువు ఉన్నందున మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. పని నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తామని తహశీల్దార్ టి. సత్యనారాయణ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.








# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక

- పార్టీ బలోపేతానిక సమష్టిగా పనిచేయాలి
- చల్లవానిపేటలో టీడీపీ క్యాడర్ సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బగ్గు అర్చన పిలుపు

**జలుమూరు, జులై 10(వార్త):** తెలుగుదేశం పార్టీకి అసలైన బలం క్షేత్రస్థాయి కార్యకర్తలేనని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం జలుమూరు మండలం చల్లవానిపేట గ్రామంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన పార్టీ క్యాడర్ సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

ప్రతి క్లస్టర్ ఇన్‌చార్జ్ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యకర్తల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం పార్టీలో లభించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు, ఇన్‌చార్జులు విభేదాలకు తావివ్వకుండా ఒకే లక్ష్యంతో పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ వెలమల చంద్రభూషణ్, జెడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు గరుగుబెల్లి ఝాన్సీరాణి, యూనిట్ ఇన్‌చార్జులు జుత్తు అప్పలనాయుడు, బోడాల బాలకృష్ణ, పంచిరెడ్డి రామచంద్రరావు, నక్క రమేష్ నాయుడు, తమ్మన్నగారి సతీష్ కుమార్, చల్ల షణ్ముఖరావు, కూన వీరన్న, జిల్లా తెలుగు యువత కార్యదర్శి గొలివి బాలకృష్ణ, మునికోటి గంగాధర్, భైరి రమణమూర్తి, కూన ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



## నౌపడ పశువుల ఆసుపత్రి నిర్లక్ష్యానికి నిలయం

- సిబ్బంది జాడే లేదు
- తాళం వేసిన ఆసుపత్రితో పశుపోషకుల అవస్థలు

**సంతబొమ్మాళి, జులై 10(వార్త):** నౌపడ ప్రభుత్వ పశువైద్యశాల నిర్లక్ష్యానికి చిరునామాగా మారి పశు వైద్యం పడకేసింది. వైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పని వేళల్లో తరచూ తాళం వేసి ఉండడంతో చికిత్స కోసం వచ్చే రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నౌపడ, పరిసర గ్రామాల్లోని వందలాది మంది రైతులు, పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు ఈ ఆసుపత్రిపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం పశువుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశు వైద్య శాఖ జిల్లా అధికారులు స్పందించి పశు వైద్య సిబ్బంది నౌపడ పశువైద్యశాలలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

### డిప్యూటేషన్‌తో త్వరలో సిబ్బంది ఏర్పాటు:

- మండల పశువైద్యాధికారి రాజ్ కిరణ్

నౌపడ ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై మండల పశువైద్యాధికారి రాజ్ కిరణ్ ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ, మరికొద్ది రోజుల్లో డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమించి పశువైద్య సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న సిబ్బంది కొరతను తాత్కాలికంగా డిప్యూటేషన్ ద్వారా అధిగమించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అలాగే, నౌపడ పశు వైద్యశాలలో విధులు నిర్వహించాల్సిన జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ( జే వి ఓ ) ఇక్కడ విధుల్లో చేరకుండానే మెడికల్ లీవ్‌లోకి వెళ్లడంతో సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

## ఎస్ఐఆర్‌ను శత శాతం విజయవంతం చేయాలి

- పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి



**పలాస, జులై 10 (వార్త):** పలాస నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ పై పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలాస మండల ముఖ్య నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, క్లస్టర్ కో కన్వీనర్ యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ స్థాయి నాయకులు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న చౌదరి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రభుత్వం నిర్దేశించిన గడువు సమీపిస్తున్నందున ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తమకు కేటాయించిన బూత్‌లలో విస్తృతంగా పర్యటించి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా, అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులు సమయానికి పూర్తయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని శత శాతం విజయవంతం చేయడమే లక్ష్యంగా అందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయ్యేలా సహకరించాలని వెంకన్న చౌదరి సూచించారు. గడువు ముగిసేలోపు ప్రతి బూత్‌లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసి పలాస నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎస్ఐఆర్‌పై ఆందోళన అవసరం లేదు

- ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, జులై 10(వార్త):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావులు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం పలాసకు చెందిన మైనార్టీ ప్రతినిధులు వారిని కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియలో 2002 నాటి కుటుంబ, పూర్వీకుల వివరాలు సమర్పించాలని కోరుతున్నప్పటికీ, తమ వద్ద ఆ పత్రాలు లేవని వివరించారు. ప్రస్తుతం ఉన్న ఆధార్ కార్డు తదితర గుర్తింపు పత్రాలను పరిగణనలోకి తీసుకుని ఓటరు ధృవీకరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గౌతు శిరీష, వజ్జ బాబూరావులు మాట్లాడుతూ సమస్యను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరికి కూడా అన్యాయం జరగకుండా ప్రభుత్వం, ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేస్తామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు, భయాందోళనలకు తావు లేదని, సందేహాలు ఉంటే సంబంధిత అధికారులు లేదా ప్రజాప్రతినిధులను సంప్రదించాలని వారు సూచించారు.



## వరిలో యాజమాన్య చర్యలు చేపట్టాలి

**ఇచ్ఛాపురం, జులై 10(వార్త):** పాయితారి, కీర్తిపురం బొడ్డకాళి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో వరి నారుమడుల పరిశీలనతో పాటు రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో 389 హెక్టార్లలో 20 రోజుల వయస్సు గల వరి నారుమడులు సిద్ధంగా ఉన్నాయని. ఇప్పటికే సుమారు 12 ఎకరాల్లో వరి నాట్లు (ఎదా) ప్రారంభమయ్యాయని నారుమడులు ఆరోగ్యకరమైన పెరుగుదల దశలో ఉన్నందున రైతులు సరైన యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు. నారుమడిలో నీటిని అవసరానికి మించి నిల్వ ఉంచకుండా పలుచటి నీటి పొర మాత్రమే ఉండేలా చూసుకోవాలని, అధిక వర్షాలు కురిసినప్పుడు వెంటనే నీటిని బయటకు పంపించి డ్రైనేజీ సదుపాయం కల్పించాలని సూచించారు. ఆకుమచ్చ, కాండం కుళ్లు, పురుగుల ఉధృతి కనిపించిన వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి శాస్త్రీయ సలహాల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు 20--25 రోజుల వయస్సు గల నాట్లను నాటడం ద్వారా మంచి ఎదుగుదల, అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. నాట్లు తీసే సమయంలో వేర్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలని, సిఫార్సు చేసిన దూరంలో నాట్లు వేసి సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. మండలంలో ప్రస్తుతం యూరియా 134 మెట్రిక్ టన్నులు, డీఏపీ 20 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా సమీప రైతు సేవా కేంద్రాలు ద్వారా ఎరువులను పొందవచ్చని తెలిపారు. అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వినియోగించి, వ్యవసాయ శాఖ సిఫార్సుల ప్రకారం సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో శాస్త్రీయ వరి సాగు, సమగ్ర పంట సంరక్షణ, నీటి యాజమాన్యం, ఎరువుల సక్రమ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి , పి.పి.వి.వి. అజయ్ కుమార్, రైతులు , పి ఏ సి ఎస్ డైరెక్టర్ బాలరాజు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుపద్మనాభం గ్రామ రైతులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546